క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్ వెలసిన వరసిద్ధి వినాయక ఆలయంలో బుధవారం సాయంత్రం లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ 19వ వార్షికోత్సవాల్లో భాగంగా వేకువజామున పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఐ.వి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహించిన హోమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం నిర్వహించనున్న అన్నసమారాధనలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజువాక: ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్, కర్ణవానిపాలెం ఫీడర్లలో ఈనెల 7న నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశ్వేశ్వరయ్యనగర్, శ్రీరామ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సంకీర్తనలకు త్రిశక్తి భజన మండలి



సంకీర్తనలకు బయల్దేరిన భజన మండలి సభ్యులు

గాజువాక: వారణాసి, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగరాజ్‌లలోని ఆలయాల్లో భజన నామ సంకీర్తనలకు స్థానిక త్రిశక్తి భజన మండలికి చెందిన భజరంగి భజన మంజరి సభ్యులు బుధవారం బయల్దేరి వెళ్లారు. ఆయా ఆలయాల నుంచి అందిన ఆహ్వానం మేరకు వారు ఈనెల 13వ తేదీ వరకు భజన సంకీర్తనలు నిర్వహించనున్నట్టు బి.రాజారావు తెలిపారు.

శివారు.. అపార్ట్‌మెంట్ల జోరు

కొన్నేళ్ల కిందట వరకూ అవి శివారు ప్రాంతాలు.. పంట భూములు.. ముళ్ల పొదలతో నిర్మానుష్యంగా ఉండేవి. నగరం విస్తరించడం... ప్రజలు కూడా ప్రశాంత జీవనానికి మక్కువ చూపడంతో ఆ శివారు ప్రాంతాల్లో ఇప్పుడు ఆకాశ హర్మ్యాలు వస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌ల జోరు సాగుతోంది. జనాల తాకిడితో సందడిగా మారాయి.



గ్రీన్‌సిటీ ప్రాంతంలో నిర్మించిన ఫ్లాట్లు

కాలుష్యానికి దూరంగా ఉండడంతో నివాసానికి ఆసక్తి

కూర్మన్నపాలెం ప్రాంతంలో పెరిగిన అపార్టుమెంట్ల సంస్కృతి

Apartment Culture

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ప్రాంతంలో నివాసాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఎక్కడికక్కడ భారీ నిర్మాణాలు సాగుతున్నాయి. వాతావరణ కాలుష్యానికి దూరంగా.. ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో అనేక మంది ఇక్కడ స్థిర నివాసాలకు ఆసక్తి చూపుతున్నారు. అటు స్టీల్‌ప్లాంట్, ఇటు ఫార్మాసిటీ, మరోవైపు ఎస్ఈజెడ్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారితో పాటు ఇతర వ్యాపార సంస్థల్లో పని చేస్తున్నవారు.. పారిశ్రామిక వేత్తలు కూడా కూర్మన్నపాలెం ప్రాంతాన్నే ఎంచుకుంటున్నారు.

చేరువలో రైల్వే స్టేషన్



విశాలమైన రోడ్లు వచ్చాయి. దీంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. కార్యాలయాలు, సంస్థలకు చేరుకోవడానికి సులువుగా ఉంటుంది. ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలన్నా సమీపంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ఉండడంతో ప్రతి ఒక్కరు నివాసానికి ఈ ప్రాంతాన్నే ఎంచుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా అపార్టుమెంట్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రజల్లో ఉన్న డిమాండ్ దృష్టిలో పెట్టుకొని అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి సకల సదుపాయాలతో అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు.

12 అంతస్తుల వరకూ..

రాజీవ్‌నగర్, వడ్లపూడి, తిరుమలనగర్, పుడాకాలనీ, కూర్మన్నపాలెం, ఫకీర్ తక్యా వెళ్లే మార్గాల్లో లెక్కకు మించి అపార్టుమెంట్స్ నిర్మాణాలు చక చకా సాగిపోతున్నాయి. 11 నుంచి 12 అంతస్తుల వరకు వేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చేవారు సైతం ఈ ప్రాంతాన్నే శాశ్వత నివాసాలకు ఎంపిక చేసుకుంటున్నారు. ప్రజల ఆశక్తిని గమనించిన బిల్డర్స్ కూడా ఆఫర్స్ ప్రకటించి ఆకట్టుకుంటున్నారు. ప్రధానంగా రుణ సదుపాయం, ఇంటిని అందంగా తయారు చేయడం వంటి ఆఫర్స్ ఇస్తున్నారు.

పెరిగిన డిమాండ్



కూర్మన్నపాలెంలో ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలాలన్నీ అపార్టుమెంట్స్‌గా మారిపోతున్నాయి. ఇప్పటికే వేలాదిమంది ఫ్లాట్స్ కొనుగోలు చేసి అక్కడే నివాసం ఉండడంతో జనాభా పరంగా కూడా కూర్మన్నపాలెం అభివృద్ధి సాధించింది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ప్రధాన రహదారిలో వ్యాపార, వాణిజ్య, వస్త్ర దుకాణాలు వెలుస్తున్నాయి.

నిర్వాసిత కాలనీల్లో సైతం

శివారు ప్రాంతాల్లో ఉన్న అపార్టుమెంట్ల సంస్కృతి ఇప్పుడు ఉక్కు నిర్వాసిత కాలనీల్లో కూడా ప్రారంభమవుతోంది. రెండు, మూడు ఫ్లాట్ల యజమానులు ఒక్కటై అభివృద్ధి పేరిట బిల్డర్లకు అప్పగించి భారీ నిర్మాణాలు అయ్యేలా సహకరిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతలో ఎక్కడ చూసినా అపార్టుమెంట్స్ కనిపిస్తున్నాయి.

పుంజుకున్న వ్యాపారాలు



అపార్టుమెంట్ల నిర్మాణం విరివిగా సాగడంతో వ్యాపారాలు పుంజుకున్నాయి. ప్రధానంగా సిమెంట్, స్టీల్‌కు గిరాకీ పెరిగింది. ఒకప్పుడు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి రోజూ అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి.

– ఎం.సూర్యప్రసాద్, సిమెంట్ వ్యాపారి, సిద్ధార్థనగర్

ఒకప్పుడు పల్లె వాతావరణం



కూర్మన్నపాలెంలో కొద్ది సంవత్సరాల కిందట వరకూ పల్లె వాతావరణం ఉండేది. ఈ ప్రాంతంలో నివాసానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడంతో అపార్ట్ మెంట్ల సంస్కృతి పెరిగి కూర్మన్నపాలెం బాగా అభివృద్ధి చెందింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందువల్లే పెద్ద పెద్ద షాపింగ్ మాళ్లు కూడా ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యాయి.

– డి.దీపిక, కణితి కాలనీ వాసి

అపార్టుమెంట్‌తో భద్రత



అపార్టుమెంట్ల వల్ల భద్రత పెరిగింది. బిల్డర్లు కూడా సదుపాయాలు కల్పించడం వల్ల ప్రస్తుతానికి ఇబ్బందులు ఏవీ లేవు. అందరం కలసికట్టుగా ఉండడంతో పాటు పండగలు, పూజలు సామూహికంగా నిర్వహించుకోవడానికి వెసులుబాటు ఉంది. అందువల్లే ఫ్లాట్ కొనుగోలు చేసి ఇక్కడే స్థిరపడ్డాం.

– మాధురి, తిరుమలనగర్ అపార్టుమెంట్ వాసి



రాజీవ్‌నగర్‌లో వెలసిన అపార్టుమెంట్లు

14న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయనున్నామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ తెలిపారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జె.రామకృష్ణ, వర్మ, రాజాబాబు, రమేష్, సుబ్రహ్మణ్యం, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో దేశ ప్రగతి



మాట్లాడుతున్న యూబీఐ చీఫ్ మేనేజర్

కూర్మన్నపాలెం: విరివిగా పరిశ్రమలు స్థాపించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని పలువురు వక్తలు సూచించారు. రుణాలు పొంది సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలని వారు కోరారు. గ్రీన్‌సిటీలో యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం ఏర్పాటు చేసిన మెగా ఎంఎస్ఎంఈ శిబిరంలో ఎం. శ్రీ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ఎవరూ ఆధార పడకూడదన్నారు. తమకు తాముగా అభివృద్ధి సాధించినప్పుడు ప్రయోజనం ఉంటుందన్నారు. యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ బిజూ వాసుదేవన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలతో 400 సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. సదస్సుల్లో ప్రభుత్వ రాయితీలు, పథకాలు, తదితర అంశాలను వివరిస్తుమన్నారు. విశాఖ జనరల్ మేనేజర్ శాలిని మీనన్, రీజనల్ మేనేజర్ ఆర్. నరసింహకుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ వి. ఆదిశేషు, బ్యాంకు వివిధ శాఖలకు చెందిన మేనేజర్లు,సిబ్బంది పారిశ్రామిక వేత్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్రమణ చెర నుంచి ప్రభుత్వ భూమి స్వాధీనం

పెదగంట్యాడ: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెదగంట్యాడ మండల తహసీల్దార్ పి.అమల హెచ్చరించారు. మండలంలోని నడుపూరు తాలూకా సర్వే నెంబర్ 176లో సుమారు 15 సెంట్ల స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించాడు. ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాడు. ఈ నేపథ్యంలో తమకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో ఆ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ స్థలమని గుర్తించామన్నారు. దీంతో ఆ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీని పొక్లెయిన్ సాయంతో బుధవారం తొలగించామన్నారు.

సర్వే నెంబర్ మార్చి విక్రయాలు

మండలంలోని నడుపూరు గ్రామంలో ఇటు రెవెన్యూ, అటు స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎకరాలకు ఎకరాల భూములు ఉన్నాయి. ఇది శివారు ప్రాంతం కావడంతో ఈ భూములపై ఆక్రమణదారుల కళ్లు పడుతున్నాయి. రెవెన్యూ డిపార్టుమెంట్‌లోని



ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కింది స్థాయి సిబ్బందితో కలసి భూ ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా సదరు భూములను ఇండ్ల స్థలాలుగా విభజించి ఆపై సర్వే నెంబర్లు మార్చేసి జోరుగా విక్రయాలు చేపడుతున్నారని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ స్థలంలో డ నిర్మించిన ప్రహరీని తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన యూనియన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఎంతో కష్టానికి ఓర్చి రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో నూరు శాతంతో 14 వేల టన్నులు హాట్‌మెటల్ ఉత్పత్తి చేస్తున్నారన్నారు. నెలకు రూ. 2 వేల కోట్లు అమ్మకాలు జరుగుతున్నా ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈనెల ఒకటో తేదీకి 280 శాతం జీతం పెండింగ్‌లో పెట్టారన్నారు. ఉద్యోగుల పీఎఫ్ చెల్లించకుండా, త్రిఫ్ట్ సొసైటీకి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన హెచ్ఆర్ఏ నిలిపి వేయడం



ప్రసంగిస్తున్న నీరుకొండ రామచంద్రరావు

తో పాటు క్వార్టర్లలో ఉన్న వారికి విద్యుత్ భారం పెంచారన్నారు. ఈనెల 31వ తేదీ లోగా జీతం బకాయిలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కొమ్ము ప్రసాదరావు, జగదీష్, రమణమూర్తి, కారు రమణ, ఎస్.ఎ. నాయుడు, రవికుమార్, వెంకన్న, మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన కరెంట్ స్తంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని డెయిరీ కాలనీలో మంగళవారం రాత్రి విద్యుత్ స్తంభం కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డెయిరీ కాలనీలో ఇటీవల కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ మేరకు అక్కడ గోతులు తవ్వారు. మంగళవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం రోడ్డులో వస్తూ కరెంట్ స్తంభాన్ని ఢీకొనడంతో ఎదురుగా ఉన్న ఇంటిపై పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించి ఆ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



ఓ ఇంటిపై కూలిన కరెంట్ స్తంభం

అర్ధరాత్రి ఆటో దగ్ధం

పెదగంట్యాడ: మండలంలోని సిద్దేశ్వరంలో మంగళవారం అర్ధరాత్రి ఓ ఆటో అగ్నికి ఆహుతైంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని సిద్దేశ్వరం రామాలయం ఎదురుగా అప్పలరెడ్డి అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా మంగళవారం రాత్రి రోడ్డు మార్జిన్‌లో ఆటోను పార్కింగ్ చేశాడు. తర్వాత ఇంట్లోకి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టారు. అది గమనించిన దాసరి రమణ అనే వ్యక్తి అప్పలరెడ్డికి సమాచారం ఇచ్చాడు. వెంటనే మంటల్లో చిక్కుకున్న ఆటోపై నీళ్లుపోసి మంటలార్పారు. అప్పటికే ఆటో టాప్, సీట్ పూర్తిగా కాలిపోగా అద్దం పగిలిపోయింది. బుధవారం ఉదయం ఆయన న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అగ్నికి ఆహుతవుతున్న ఆటో

తాగునీరు వృథా!



యాతపాలెం ప్రధాన రహదారిపై వృథాగా పోతున్న మంచినీరు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెం ప్రధాన రహదారిలో మూడు చోట్ల పైపులైన్ పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. అసలే వేసవి కావడంతో తాగునీరు అంతంత మాత్రంగానే వస్తోందని.. పైపులైన్ పగిలిపోవడంతో తమ ఇళ్లకు నీరు రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా పరిస్థితి ఇలాగే ఉందని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ బాగు చేయించాలని కోరుతున్నారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిలో గాయనీగాయకులు, అతిథులు

సీతంపేట : ఫ్రెండ్స్ రిథమ్స్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన హిందీ, తెలుగు చిత్రగీతాల సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, భయ్యా శ్రీనివాస్, ఫణిస్వామి జ్యోతి వెలిగించి సంగీత విభావరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంగీత కార్యక్రమాల వల్ల మనసుకి స్వాంతన చేకూరుతుందని తెలిపారు. గాయనీ గాయకులు ఎం.ఎస్.మాధవ్, పీవీఎస్‌వీ ప్రసాద్, వి.ప్రభాకర్, సీహెచ్.వి.సత్యనారాయణ, సత్యశ్రీ, సి.వి.రాజేశ్వరి, పావని, భూమిక, అభినయ్ తదితరులు హిందీ, తెలుగు చిత్రాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు.

మహిళల హక్కుల రక్షణకు ఉద్యమించాలి



ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల నాయకులు

సీతంపేట : ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న మహిళల హక్కులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సదస్సు, ర్యాలీని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి ప్రతి మహిళా పోరాడాలని పిలుపునిచ్చారు. పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో సమానమేనని, అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాదాన్ని తీసుకొచ్చి మహిళల హక్కులను కాలరాయడానికి కుట్ర పన్నిందన్నారు. ఇకనైనా మహిళలంతా మేధావులు, అభ్యుదయవాదులతో కలిసి హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు వివక్షకు గురవుతున్నారని, పురుషుల చెప్పుచేతల్లో మహిళలు ఉండేలా మనుధర్మం చేసిందన్నారు. మను ధర్మం తీసుకురావడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ వంటి హిందూ ఫాసిస్టు సంస్థలు కుటిల పన్నాగాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని హిందుత్వ ప్రభుత్వం రద్దు చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి సమాజాన్ని ఫాసిస్ట్ దేశంగా చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్. వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఇందిర, జిల్లా ఉపాధ్యక్షురాలు బాలనాగమ్మ, భారత నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు, అమరవీరుల మృతుల కమిటీ ప్రతినిధి పద్మ, చైతన్య మహిళా సమాఖ్య ప్రతినిధి లలిత, మురికివాడల సంఘం నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.